# సింగిల్ పేజి కథలు

## నాణానికి మరోవైపు

మా మేనమామ రఘురామయ్య అంటే నాకు ఒళ్ళు మంట. నాకెందుకో ఆయన పద్ధతులు నచ్చవు. దబ్బపండు ఛాయతో..పొందూరు ఖద్దరు బట్టల్లో..ఆజానుబాహుడు ఆరడుగుల విగ్రహం అయినందువల్ల హుందాగానే వుంటాడు. అయితే నాకు నచ్చనిదేమిటంటే ఆయన చుట్టుపక్కల వున్నవాళ్ళు ఆయన వస్తుంటే లేచి నుంచోడం..ఒదిగి ఒదిగి వుండడం..అడుగులకు మడుగులొత్తుడం..ఓహ్... ఎంత చిరాగ్గా వుంటుందో..ఏంటా బానిసత్వం? మనిషి ముందు మనిషి ఒదిగి వుండడమేమిటి? ఈ విషయాలు మా మామయ్య భార్య జానకమ్మ దగ్గర కూడా కదిపేదాన్ని. అయితే ఆవిడ నవ్వి తోసిపారేసేది. నా కోపం తారాస్థాయికి చేరేది. ఇక మా అమ్మయితే సరేసరి.

"మా అన్నయ్య అంటే ఏమిటనుకున్నావు? మా అందరికీ పెద్దదిక్కు. మాకే కాదు ఊరందరికీ అంతే! అసలు పెద్దదిక్కు అంటూ ఒకరుంటే ఎంత ధైర్యంగా వుంటుందో నీకేం తెలుసు? మా గౌరవాభిమానాలు ఆ పెద్దరికానికే..నీ పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి అణకువగా వుండడం అలవర్చుకో. పెద్దదానివి అవుతున్నావు" అని సున్నితంగా మందలించేది.

అబ్బే బానిసత్వానికి గౌరవాభిమానాలని పేరు పెట్టుకుని ఆత్మవంచన చేసుకోవడమొకటి. ఛీ...ఛీ..వీళ్ళు మారరు. అయినా ఇప్పుడు ఆ మహానుభావుణ్ణి ఎందుకు తల్చుకుంటున్నానంటే..రేపు మా ఊరు వెళ్ళబోతున్నాము. నేను రానుమొర్రో అంటే అమ్మ అస్సలు వినడం లేదు. అమ్మమ్మకు ఒంట్లో బాగుండడం లేదట. ఎంతోకాలం బ్రతకదట కూడా. అందుచేత ఇప్పుడు అర్జెంటుగా వెళ్ళి చూడాలి. నాకేమో అక్కడికెళితే మామయ్య కంటబడతాడు. కోపం నషాళానికంటుతుంది. అయినా తప్పదు. భరించాలి.

మేమెళ్ళేసరికి మామయ్య వసారాలో పడక్కుర్చీలో కూర్చుని పేపర్ చదువుకుంటున్నాడు. మమ్మల్ని చూసి లేచి ఆప్యాయంగా మా దగ్గరకొచ్చి ప్రయాణమెలా జరిగిందని కుశలమడిగాడు. అమ్మ బాగానే మాట్లాడింది కాని నేనస్సలు నోరు తెరవలేదు. మామయ్య అదేమీ పట్టించుకోకుండా "ప్రయాణ బడలికతో వున్నారు. హాయిగా విశ్రాంతి తీసుకోండి. నేనలా బయటకెళ్ళొస్తాను" అని అభిమానంగా నా తలనిమిరి వెళ్ళిపోయాడు.

మళ్ళీ మామూలే నా కంటికి మా మామయ్య నియంతలా..చుట్టూ వున్నవాళ్ళు బానిసల్లా కన్పించసాగారు. ఆ వాతావరణానికి దూరంగా వుండడం కోసం నా చిన్నప్పటి స్నేహితురాళ్ళ ఇళ్ళకి వెళ్ళి కబుర్లతో కాలక్షేపం చేసేదాన్ని.

ఒకరోజు మా పొలం మీదుగా సరోజ ఇంటికి వెళుతున్నాను. అంతలో మా పొలంలో పనిచేస్తున్న వీరయ్యకి పాము కరిచింది. అప్పటిదాకా శీనయ్య పట్టిన గొడుగు నీడలో నుంచుని పనులు పురమాయిస్తూ..అజమాయిషీ చేస్తూ నుంచున్న మా మామయ్య ఒక్క ఉదుటున వీరయ్య దగ్గరకెళ్ళి భుజానికేసుకుని ప్రభుత్వాసుపత్రివైపు పరిగెత్తాడు. సకాలానికి వైద్యం అందడంతో వీరయ్యకి గండం గడిచింది. వీరయ్య భార్యా పిల్లలని ఊరడించాడు. ధైర్యం నూరిపోశాడు మామయ్య. ఎప్పుడూ నిండుగా, గంభీరంగా వుండేవాడు..వీరయ్యకి అలా జరిగేసరికి కృంగిపోయాడు. ఇంట్లో వాళ్ళకి ఏదో జరిగినట్టు విలవిల్లాడిపోయాడు. పొద్దుపోయేదాకా ఆసుపత్రిలోనే వుండి..ఒకటికి రెండుసార్లు 'వీరయ్యకి ఇంకేం ఫర్వాలేదు' అని డాక్టర్ చెప్పిన మీదట..వీరయ్య భార్య చేతిలో డబ్బు నుంచి వీరయ్య పూర్తిగా కోలుకున్నాకే పనిలోకి పంపమని చెప్పి ఇంటికి వచ్చాడు.

అప్పుడర్థమయింది మామయ్య అంటే ఏమిటో...ఆయన చుట్టూ వున్నవాళ్ళు బానిసలు కారు ఆత్మీయులు. ఆయన అభిమానం పొందినవాళ్ళు. అమ్మా, నాన్నల పట్ల మనం ప్రేమ, గౌరవం చూపిస్తాము ఎందుకు? వాళ్ళు మనల్ని కనిపెట్టుకుని వుంటారు కాబట్టి. ఒక పెద్దదిక్కుగా అందర్నీ ఆయన కనిపెట్టుకుని వుంటాడు. వాళ్ళ సుఖాలకి ఆనందిస్తాడు. కష్టాలకి కృంగిపోతాడు. అందుకే అందరికీ ఆయనపట్ల గౌరవంతో కూడిన భయం. అది ఆయన ప్రేమతో పొందుతున్నారు కాని ఆధిపత్యం చూసి..అజమాయిషీ చేసి కాదు. నాణానికి మరోవైపుని స్పష్టంగా చూడగలిగాను.

ఊరి నుండి బయల్దేరేటప్పుడు మనస్ఫూర్తిగా..క్షమాపణ పూర్వకంగా మామయ్య కాళ్ళకి దండం పెట్టాను.

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు
(సికింద్రాబాదు)

***

## చిన్ని చిన్ని ఆశ!

"య్యా..హూ" గట్టిగా పిడికిలి బిగించి గాలిలోంచి బలంగా తన వైపు లాక్కున్నాడు వసంత ఉత్సాహంగా!

ఎన్నో రోజుల నుండి ఊరిస్తున్న నల్లకళ్ళ అద్దాలు, రంగుల పెన్నులు కొనడం, పెప్సీకోలా త్రాగడం! కోర్కెలన్నీ ఈరోజు తీరబోతున్నాయి.

ఆనందంతో ఓ చోట నిల్చోలేకపోతున్నాడు.

స్నేహితులంతా కళ్ళద్దాలు పెట్టుకుని క్రికెట్ ఆడుతుంటే, అలాంటివి తనూ కొనాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. దాని ఖరీదు పది రూపాయలే. అదే అతనికి గగనమైంది. పెప్సీకోలా చల్లగా, మహా బాగా ఉంటుందని విన్నాడు. రుచి చూసే భాగ్యం ఇప్పటికి కలగబోతుంది.

పరిపరి ఆలోచనలతో ఉల్లాసంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష రాయడానికి బయలుదేరాడు వసంత్!

* * *

నలుగురు సంతానంలో మొదటివాడు వసంత్. కూలి ద్వారా వచ్చే డబ్బే వారి జీవనాధారం! అందువలన వసంత్‌కు పాకెట్‌మనీ ఉండదు. ప్రథమశ్రేణి విద్యార్థి, అతను. పై చదువులు తలకు మించిన భారమే అయినా, ఉపాధ్యాయుల ప్రోద్బలంతో పరీక్ష రాయించడానికి సిద్ధపడ్డారు అతని తల్లిదండ్రులు.

మెరిట్ స్కాలర్‌షిప్ రావడంతో, గైడుకు పరీక్ష ఫీజుకు సరిపోయింది. మాష్టారు సాయంతో స్వంతంగా ప్రిపేర్ అయ్యాడు. చార్జీలకు వంద రూపాయలు ఇచ్చి జాగ్రత్తలు చెప్పాడు తండ్రి. మాష్టారు దగ్గరకెళ్ళి వెళ్ళొస్తానని చెప్పాడు.

అన్ని జాగ్రత్తలు చెప్పిన తర్వాత "ఖర్చులకు ఈ యాభై ఉంచు వసంత్!" అన్నారు మాష్టారు.

"వద్దు సార్! నాన్న ఇచ్చారు" మొహమాట పడ్డాడు వసంత్!

"పరవాలేదు..తీసుకో!" అంటూ జేబులో ఉంచేశారు ఆయన.

సరిగ్గా ఆ క్షణం నుంచే మొదలయ్యాయి అతనిలో ఆలోచనలు.

ఊహల్లో తేలిపోతూ బస్ ఎక్కాడు. దగ్గర్లో ఉన్న పట్టణానికి చేరుకున్నాడు. పరీక్ష రాయడానికి జిల్లా కేంద్రం వెళ్ళాలి.

బస్టాండ్ వెనుక రైల్వేస్టేషన్ ఉంది. దాన్ని చూడగానే ఆలోచనొకటి అతని బుర్రలో తలుక్కున మెరిసింది. బస్ కంటే రైలు చార్జి తక్కువని త్వరగా కూడా వెళ్తుందని స్నేహితులు అంటుంటే విని ఉన్నాడు. రైలు ప్రయాణానికే మొగ్గు చూపాడు.

టికెట్ తీసుకుని రైలు ఎక్కాడు. ప్రయాణం చాలా హాయిగా, ఉల్లాసంగా సాగింది. స్టేషన్ రాగానే దిగాడు. బద్ధకంగా ఒళ్ళు విరుస్తూ, చుట్టూ చూశాడు. దీర్ఘంగా గాలి పీల్చుకున్నాడు.

"ఎక్కడి నుండి వస్తున్నావు!" వెనుక నుంచి మాటలు వినిపించడంతో ఉలిక్కిపాటుగా తలతిప్పి చూశాడు.

ఎదురుగా టికెట్ కలెక్టర్. సమాధానం చెప్పాడు వసంత్!

"టికెట్ చూపించు" అన్నాడు అతను. తీసి చూపించాడు వసంత్!